క్లుప్తంగా

గణిత దీప్తి మెటీరియల్ పంపిణీ



మెటీరియల్ పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం శ్రీదేవి, గణిత ఉపాధ్యాయుడు కోటేశ్వరరావు

కొత్తపట్నం: స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు చక్కా కోటేశ్వరరావు తన సొంత నిధులతో పదో తరగతి విద్యార్థులకు శనివారం గణిత దీప్తి మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. మార్చిలో జరగబోయే పబ్లిక్ పరీక్షలలో నూటికి నూరు మార్కులు సాధించాలనే ఉద్దేశంతో హెచ్‌ఎం మన్నెం శ్రీదేవి చేతుల మీదుగా మెటీరియల్ ఆవిష్కరించి విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఈ మెటీరియల్ వలన విద్యార్థులకు మంచి మార్కులు వస్తాయన్నారు. బాగా సాధన చేస్తే 100కి 100 మార్కులు వస్తాయన్నారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ కె.హరిబాబు, ఉపాధ్యాయులు పి.వెంకట్రావు, ఎం.శరత్‌చంద్రబాబు, కె.దేవసహాయం, పి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

డీఐపీఆర్‌ఓకు సత్కారం



గ్రేస్‌లినోరాను సత్కరిస్తున్న కార్యాలయ సిబ్బంది

ఒంగోలు అర్బన్: జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి (డీఐపీఆర్‌ఓ)గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన కె.గ్రేస్‌లినోరాను కార్యాలయ సిబ్బంది శనివారం కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. 40 సంవత్సరాలకుపైగా వివిధ హోదాల్లో పనిచేసిన ఆమె.. 2019లో జిల్లాకు బదిలీపై వచ్చి ఇక్కడే ఉద్యోగ విరమణ పొందారు. కొత్తగా వచ్చిన డీఐపీఆర్‌ఓ వేణుగోపాల్‌రెడ్డి, డీపీఆర్‌ఓ రమేష్, డివిజనల్ పీఆర్‌ఓ దుర్గాప్రసాద్, రిటైర్డ్ డీఈఓ ఐఈ రమణమూర్తి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆడిటోరియాన్ని ప్రారంభించిన మంత్రి



ఆడిటోరియాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఎంపీ, ఎమ్మెల్యేలు

ఒంగోలు సబర్బన్: నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నూతనంగా నిర్మించిన ఆడిటోరియాన్ని శనివారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి ప్రారంభించారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు, 19 డివిజన్ కార్పొరేటర్ ఈదర సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే బ్రిడ్జి నిర్మాణ ప్రాంతం పరిశీలన...

ఒంగోలు నగరంలోని అగ్రహారం రైల్వే గేటు వద్ద నూతనంగా నిర్మించనున్న రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) ప్రాంతాన్ని శనివారం మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి పరిశీలించారు. రైల్వే శాఖ అగ్రహారం రైల్వే గేటు ఎల్‌సీ నంబరు-207 వద్ద రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి మంజూరు చేసింది. ఆ ప్రాంతాన్ని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యేలు, మేయర్, కమిషనర్‌తో కలిసి మంత్రి పరిశీలించారు.



గోనుగుంట గ్రామంలో అసంపూర్తిగా ఆగిపోయిన రైతు భరోసా కేంద్ర భవనం



అయ్యప్పరాజుపాలెంలో నిర్మాణం నిలిచిపోయిన సచివాలయ భవనం

కూటమి కుట్ర..!

- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేపట్టిన భవన నిర్మాణాల పనులన్నీ నిలిపివేత
- చీమకుర్తి మండలంలోని గ్రామాల్లో ఎక్కడి పనులు అక్కడే..
- గత ప్రభుత్వంలోనే 70 శాతం పూర్తయిన పనులు
- మిగిలిన 30 శాతం పూర్తి చేస్తే ప్రజలకు మెరుగైన సేవలు
- ఉద్దేశపూర్వకంగానే పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- వైఎస్ జగన్ మార్క్ కనిపించకూడదనే ఇలా చేస్తోందని విమర్శలు



పులికొండ గ్రామంలో తుదిమెరుగులు దిద్దుకోవాల్సిన సచివాలయ భవనం

చీమకుర్తి రూరల్: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగించారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థల ద్వారా గ్రామాల్లోని ప్రజలకు అన్ని సేవలు అక్కడే అందేవిధంగా చర్యలు చేపట్టారు. అందుకు అవసరమైన భవన నిర్మాణాలకు భారీగా నిధులు కేటాయించారు. ప్రతి గ్రామంలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీలు, బల్క్ మిల్క్ సెంటర్లు వంటి వాటికి సొంత భవనాల నిర్మాణాలు చేపట్టారు. వాటి ద్వారా గ్రామాల్లోని ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు శ్రీకారం చుట్టారు. ఆయా భవన నిర్మాణాలు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే 70 శాతం వరకూ పూర్తయ్యాయి. మిగిలిన 30 శాతం పూర్తి చేస్తే గ్రామాల్లో ప్రజలకు సత్వరమే మెరుగైన సేవలు అందించేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. కానీ, గత ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కేవలం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్క్ ఎక్కడా కనిపించకూడదనే కుట్రతో ఆ 30 శాతం పనులు కూడా పూర్తిచేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. అధికారం చేపట్టి ఆరు నెలలు కావస్తున్నా ఉద్దేశపూర్వకంగా భవన నిర్మాణాలు పూర్తి చేయడం గురించి పట్టించుకోకుండా పక్కన పెట్టడంపై గ్రామాల్లో తీవ్ర స్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి.

చీమకుర్తి మండలంలో అన్ని భవనాలు అసంపూర్తిగానే...

చీమకుర్తి మండలంలోని గ్రామాల్లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పెద్ద ఎత్తున ప్రభుత్వ భవనాల నిర్మాణం చేపట్టారు. రామచంద్రాపురం పంచాయతీలో హెల్త్ సెంటర్, బల్క్ మిల్క్ సెంటర్, గోనుగుంటలో రైతు భరోసా కేంద్రం, బల్క్ మిల్క్ సెంటర్, పులికొండలో సచివాలయం, ఏలూరువారిపాలెంలో డిజిటల్ లైబ్రరీ, మంచికలపాడులో సచివాలయం, బల్క్ మిల్క్ సెంటర్, ఇలపావులూరులో హెల్త్ సెంటర్, రైతు భరోసా కేంద్రం, నిప్పట్లపాడులో సచివాలయం, హెల్త్ సెంటర్, రైతు భరోసా కేంద్రాలకు భవన నిర్మాణాలు చేపట్టి దాదాపు 70 శాతం పనులు పూర్తి చేశారు. ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షలు, రైతు భరోసా కేంద్రానికి రూ.21.8 లక్షలు, హెల్త్ సెంటర్కు రూ.25 లక్షలు, డిజిటల్ లైబ్రరీ, పాలకేంద్రాలకు రూ.15.75 లక్షల చొప్పున మంజూరు చేయడంతో చకచకా పనులు జరిగాయి. మిగిలిన 30 శాతం భవన నిర్మాణ పనులు పూర్తి చేసి వాటిని వినియోగంలోకి తెచ్చి ప్రజలకు సేవలు అందించాల్సిన ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ దిశగా చొరవ చూపుతున్న దాఖలాలే కనిపించడం లేదు. అవన్నీ అసంపూర్తిగా, నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఇలాగే వదిలేస్తే అవన్నీ శిథిలావస్థకు చేరి ప్రజాధనం భారీగా వృథా అయ్యే ప్రమాదం ఉంది. అలా జరగకముందే కూటమి ప్రభుత్వం స్పందించి కుట్రలు మానుకుని ప్రజలకు ఉపయోగపడే ప్రభుత్వ భవన నిర్మాణాలను పూర్తి చేయాల్సిన అవసరం ఉందని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

పాఠశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి



పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న సీపీఎం బృందం

ఒంగోలు టౌన్: నగరంలోని 49వ డివిజన్ కరవది బజార్‌లోని ఎంపీపీ పాఠశాలకు నూతన భవన నిర్మాణానికి తక్షణమే నిధులు మంజూరు చేయాలని సీపీఎం నగర కార్యదర్శి జి.రమేష్ డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం బృందం పాఠశాలను సందర్శించింది. మౌలిక వసతులను పరిశీలించింది. అనంతరం రమేష్ మాట్లాడుతూ ఈ పాఠశాలకు చుట్టుపక్కల నుంచి 100 మందికిపైగా విద్యార్థులు వచ్చి చదువుకుంటున్నారని తెలిపారు. స్కూలు భవన నిర్మాణం పూర్తికాకపోవడంతో తరగతుల నిర్వహణ ఇబ్బందిగా మారిందన్నారు. మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. విద్యాశాఖకు చెందిన అధికారులు ఈ పాఠశాలను ఒకసారి సందర్శించి ఇక్కడ చదువుకుంటున్న విద్యార్థుల సమస్యలు తెలుసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం డివిజన్ నాయకులు వి.మాలకొండయ్య, ఎం.శ్రీనివాసరావు, పాపని సుబ్బారావు, జి.బాలకృష్ణ, ఎం.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం పింఛన్ల పంపిణీ జరగాలి



సిటిజన్ చార్టర్ కార్యాలయంలో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: నగరంలోని సిటిజన్ చార్టర్ సెంటర్‌ను కమిషనర్ వెంకటేశ్వరరావు శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. పింఛన్ల పంపిణీ సందర్భంగా సిటిజన్ చార్టర్‌లోని పెన్షన్ మానిటరింగ్ సెల్‌లో పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. మానిటరింగ్ సెల్‌లో ఏడుగురు సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. వార్డు సచివాలయాల వారీగా జరుగుతున్న పింఛన్ల పంపిణీని సమీక్షించారు. ఏ సచివాలయంలో పింఛన్ల పంపిణీ ఆలస్యంగా జరుగుతుందో వెంటనే గుర్తించి ఆయా సచివాలయాల సిబ్బందిని అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి వార్డు సచివాలయంలో 100 శాతం పింఛన్ల పంపిణీ జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నగరంలో నీటిపన్ను వసూలుకు వేసిన టీమ్ హాజరు రిజిస్టర్‌ను కూడా ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు.

సంతనూతలపాడు మండలంలో 92 శాతం పింఛన్లు పంపిణీ

సంతనూతలపాడు: మండలంలో శనివారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను 92 శాతం పంపిణీ చేసినట్టు ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. 6,784 మందికిగానూ 6,275 మందికి పెన్షన్లు పంపిణీ చేసినట్టు చెప్పారు. నేడు, రేపు మిగిలిన వారికి పంపిణీ చేస్తామని తెలిపారు.

అమావాస్య సందర్భంగా అమ్మవారికి పూజలు



ప్రత్యేక అలంకరణలో కనకదుర్గాదేవి



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళా భక్తులు

ఒంగోలు మెట్రో: కార్తీక మాసం శని అమావాస్య కావడంతో శనివారం నగరంలోని అమ్మవారి దేవస్థానాల్లో ప్రత్యేక కుంకుమార్చన నిర్వహించారు. ఒంగోలు లాయర్ పేట షిరిడీ సాయిబాబా మందిరంలో శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి, కొత్తపట్నం బస్టాండ్లోని నల్లూరి నర్సింగ్ హోం దగ్గరున్న మహాలక్ష్మి అమ్మవారికి, కేశవస్వామిపేటలోని విజయదుర్గ అమ్మవారికి, లలితా ఆశ్రమంలోని లలితా అమ్మవారికి, బాలాజీరావుపేట కనకదుర్గ అమ్మవారికి, మంగమూరు రోడ్డు గాయత్రి అమ్మవారికి, గద్దలగుంట మహాలక్ష్మి మహాకాళి మహాసరస్వతి దేవస్థానంలో, రంగారాయుడు చెరువు దగ్గర కంచి కామాక్షమ్మ దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక మహిళలతో ఆలయ అర్చకులు సామూహికంగా కుంకుమ పూజ చేయించారు. శివాలయాలలో నవగ్రహ మండపాలలో శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విలువలతో కూడిన విద్యతోనే ఉన్నత శిఖరాలు

- మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి అమ్మనరాజా

ఒంగోలు సిటీ: చిన్నతనం నుంచే విలువలతో కూడిన విద్య, క్రమశిక్షణ వలన జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి (ఇన్‌చార్జి), ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి డి.అమ్మనరాజా అన్నారు. శనివారం ఒంగోలు పట్టణంలోని బాలసదన్‌ను సందర్శించి విద్యార్థులకు అందుతున్న వసతి, సదుపాయాలు, భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అమ్మనరాజా మాట్లాడుతూ బాలసదన్‌లోని దస్త్రాలు, కార్యాలయ నిర్వహణను పరిశీలించామని, మరింత మెరుగైన సదుపాయాల కోసం సూచనలు అందించామని అన్నారు. చట్టపరంగా విద్యార్థులకు అవసరమైన న్యాయ సహాయాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందిస్తుందని తెలిపారు. మానసిక వైద్యుల అవసరం ఉన్న పిల్లలకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పిల్లల చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ దినేష్‌కుమార్, సూపరింటెండెంట్ జీవిత పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న జిల్లా న్యాయమూర్తి అమ్మనరాజా

14న క్రిస్మస్ పాటలకు గ్రూప్ డ్యాన్స్ పోటీలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఫాదర్ డీఎస్ పాల్, తదితరులు

ఒంగోలు మెట్రో: క్రిస్మస్ పండుగ సందర్భంగా ఒంగోలు కళానిలయం ఆధ్వర్యంలో క్రిస్మస్ పాటలకు గ్రూప్ డ్యాన్స్ పోటీలను ఈ నెల 14వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 3 గంటల వరకు స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక సెయింట్ థెరిసా చర్చి ఆవరణలో ఫాదర్ డీఎస్ పాల్ శనివారం సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమంలో క్రైస్తవ యువతీ యువకులు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.10,000, రెండో బహుమతిగా రూ.5,000, మూడో బహుమతిగా రూ.3,000, కన్సోలేషన్ బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ.100 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఎంట్రీలకు చివరి తేదీ డిసెంబర్ 12గా వెల్లడించారు. ఇతర వివరాలకు 9440925092, 9963201398 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కేరళ హైస్కూల్ కరస్పాండెంట్ సిబి మైకేల్, వేలూరి శ్రీనివాసరావు, సొల్యూషన్ సిస్టర్స్, స్వర్ణ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపట్నం సముద్రతీరంలో ఒడ్డుకు చేర్చిన పడవలు



వేటకు వెళ్లకపోవడంతో వలలు అల్లుకుంటున్న మత్స్యకారులు



కొత్తపట్నంలో ముందుకొచ్చిన సముద్రం

ఫెంగల్‌పై అప్రమత్తం

ఫెంగల్ తుఫాన్ నేపథ్యంలో జిల్లాలో అధికారులు, ప్రజలు అప్రమత్తమయ్యారు. తుఫాన్ కారణంగా బలమైన గాలులు వీస్తాయని, భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలోని సముద్ర తీరప్రాంతాల్లోని మత్స్యకారులు చేపల వేటను నిలిపివేశారు. బోట్లు, వలలను ఒడ్డుకు చేర్చారు. సముద్రంలో అలలు ఎగసిపడుతుండటంతో అప్రమత్తంగా ఉన్నారు.

- సాక్షి, ఒంగోలు



ఒంగోలు నగరంలో కురుస్తున్న వర్షం



అలల ప్రభావానికి కోతకు గురైన తీరం



కొత్తపట్నం సముద్రతీరంలో ఎగసిపడుతున్న అలలు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఒంగోలు డివిజన్
9010224456 90103 57744
90102 02762
చీమకుర్తి 84639 03727
Office mail : sakshiongads@gmail.com